
నేటి దినపత్రిక సూర్య www.suryaa.com
EVENING EDITION
4 PM www.suryaa.com
శుక్రవారం 22-08-2025
పేజీలు: 02







## విశ్వంభర మెగా బ్లాస్ట్ గ్లింప్స్

ఓ పెద్దాయన ఏదో చెప్పబోతుంటే... చిన్న పాప 'అర్థం కాలేదు' అని చెబుతుంది. ఆయనేదో గొప్ప, పెద్ద అంశాన్ని గురించి చెబుతున్నాడని తెలుస్తోంది కానీ అదేమిటో ఆ చిన్నారికి అర్థం కాలేదన్నది వాస్తవం. అలానే ఈ గ్లింప్స్ లో కూడా ఈ సినిమా గొప్పగా ఉండబోతోంది, దర్శకుడు వశిష్ఠ ఏదో గొప్పగా చెప్పబోతున్నాడని తెలుస్తోంది. కానీ గ్లింప్స్ మాత్రం అర్థం కాకుండా ఉంది! అయితే ఈ మధ్యలో వచ్చిన చాలా సినిమాల కంటే ఈ గ్లింప్స్ లో వి.ఎఫ్.ఎక్స్. బాగున్నాయి.

# పరదా మూవీ రివ్యూ



అనుపమ పరమేశ్వర్ కథానాయికగా లీడ్ రోల్లో యాక్ట్ చేసిన లేటెస్ట్ మూవీ 'పరదా'. ప్రవీణ్ కాండ్రేగుల దర్శకత్వం వహించింది. విజయ్ డెంకాడతో కలిసి శ్రీధర్ మక్కువ, శ్రీనివాసులు పివిలు ఈ సినిమా నిర్మాణంలో భాగస్వామలయ్యారు. సురేష్ ప్రొడక్షన్స్ డిస్ట్రిబ్యూట్ చేసిన ఈ సినిమా ఈ రోజు ప్రపంచ వ్యాప్తంగా విడుదలైంది. మరి ఈ సినిమాతో అనుపమ ఖాతాలో హిట్ పడినట్టేనా.. సుబ్బు అలియాస్ సుబ్బలక్ష్మి (అనుపమ పరమేశ్వర్) పడతి అనే కల్పిత గ్రామంలో జీవిస్తూ ఉంటుంది. ఆ గ్రామంలో మహిళలందరూ ముఖంపై పరదాతో కప్పుకొని ఉండి తీరాలి. ఫ్యామిలీ మెంబర్స్ తప్పితే ఇంకెవరు చూడడానికి వీలు లేదు. ఎవరైనా గ్రామ కట్టుబాట్లను ఉల్లంఘిస్తే..ఆ ఊరి దేవ జ్వాలమ్మ ఆగ్రహానికి గురికావాల్సి ఉంటుందని గ్రామస్థులు నమ్ముతుంటారు. అలాంటి గ్రామంలో ఓ అనుకోని సంఘటనతో సుబ్బు తన ముఖంపై ఉన్న పరదాను తొలిగించాల్సి వస్తోంది. అందుకు దారితీసిన పరిస్థితులు ఏమిటి.. ? సుబ్బు పరదా తెలిగించే ఈ ప్రయాణంలో రత్నమ్మ (సంగతం క్రిష్), అమిష్ఠ (దర్శన రాజేంద్రన్)లు ఎలాంటి పాత్ర పోషించారు. చివరకు తాను పుట్టిన గ్రామం కోసం సుబ్బలక్ష్మి ఏం చేసిందనేదే తెలియాలంటే ఈ సినిమా చూడాల్సిందే. ప్రవీణ్ కాండ్రేగులు ఈ యేడాది సమంత నిర్మాణంలో 'శుభం' సినిమాతో మంచి దర్శకుడిగా పేరు తెచ్చుకున్నాడు. ఇపుడు రెండో ప్రయత్నంలో భాగంగా 'పరదా' అనే సంక్లిష్టమైన సబ్జెక్ట్ తో ఆడియన్స్ ముందుకు వచ్చాడు. ఇప్పటికీ మన సనాతన సంప్రదాయంలో కొన్ని ప్రాంతాల్లో ముఖానికి పరదా వేసుకోవడం సాంప్రదాయంగా వస్తోంది. ఇక ముస్లిమ్స్ లో కూడా ఆడవాళ్లు బురఖా ఎలాగో.. హిందూ సాంప్రదాయంలో ఈ పరదా పద్ధతి ఉంది. ఇప్పటికీ కొన్ని ప్రాంతాల ఆడవాళ్లు.. ఎవరు చెప్పకపోయినా.. ముఖం కనపడకుండా పరదాను కప్పకుంటూ తమ ఆచార సంప్రదాయాలను పాటిస్తూ ఆ సంప్రదాయాన్ని కాపాడుతున్నారు. కొంత మందికి ఈ పరదా సంప్రదాయం నచ్చకపోవచ్చు. దర్శకుడు ప్రవీణ్ కాండ్రేగుల ఇలాంటి ఓ సంప్రదాయాన్ని టచ్ చేసే ప్రయత్నం చేసాడు. ఈ పరదా తొలిగిస్తే.. ఆ ఊరిని కాపాడే జ్వాలమ్మ ఆగ్రహానికి గురికావడం వంటివి కథ లో యాడ్ చేసుకోవడం బాగుంది. ముఖ్యంగా పరదా సంప్రదాయంతో కొంత మంది ఆడవాళ్లు వంటింటి కుందేళ్లుగా మిగిలిపోతున్నారనే సందేశాన్ని ఇచ్చే ప్రయత్నం చేసాడు. తాను చెప్పాలనుకున్న కథను పూర్తి స్థాయిలో మెప్పించలేకపోయాడనే చెప్పాలి. ఈ సినిమాలో కథానాయిక పాత్రకు ధీటుగా ఇతర పాత్రలను రాసుకుంటే బాగుండేది. ఇందులో దర్శన అనుపమతో పాటు మరో రెండు మహిళ పాత్రలను హైలెట్ గా చూపించాడు. సినిమాలో ధర్మస్థల ఎపిసోడ్ ఇంట్రెస్టింగ్ గా ఉంది.

మహిళలకు సంబంధించిన కొన్ని అంశాలు వాళ్లను టచ్ చేస్తాయి. ఇలాంటి పరదా సంప్రదాయమే మరో వర్గంలో బురఖాగా చెలామణిలో ఉంది. దాన్ని కూడా సమాంతరంగా టచ్ చేసి ఉండే బాగుండేదని సనాతన వాదులు చెబుతున్న మాట. ఓవరాల్ గా దర్శకుడు చెప్పాలనుకున్న సబ్జెక్ట్ కొంత వరకే మెప్పించగలిగింది. ఈ సినిమాకు గోపీ సుందర్ అద్భుతమైన బ్యాక్ గ్రౌండ్ స్కోర్ ఈ సినిమాకు ప్లస్ పాయింట్ గా నిలిచింది. ఎడిటర్ సెకండాఫ్ ను ఇంకాస్త ట్రిమ్ చేసుంటే బాగుండేది. సినిమాటోగ్రఫీ, నిర్మాణ విలువలు బాగున్నాయి. ఓవరాల్ గా ఓ వర్గం ప్రేక్షకులను ఈ సినిమా మెప్పిస్తుందనే చెప్పాలి. అనుపమ పరమేశ్వర్ సుబ్బు పాత్రలో జీవించింది. ఆ పరదా పద్ధతుల్లో నలిగే మహిళా పాత్రలో జీవించింది. అనుపమ తర్వాత దర్శన రాజేంద్ర ఉన్నంత ఈ సినిమాను ఎంటర్టైన్ చేసింది. సంగీత పాత్ర కదిలిస్తుంది. మిగిలిన నటీనటులు తమ పరిధి మేరకు రాణించింది.




## మెగా స్వాగ్ తో అదిరిన గ్లింప్స్

తెలుగు సినిమా గర్వించదగ్గ నటుల్లో ఒకరైన మెగాస్టార్ చిరంజీవి హీరోగా నటిస్తున్న లేటెస్ట్ చిత్రాల్లో దర్శకుడు అనిల్ రావిపూడి కలయికలో తెరకెక్కిస్తున్న చిత్రం కూడా ఒకటి. మెగాస్టార్ కెరీర్లో 157వ సినిమాగా తెరకెక్కిస్తున్న ఈ చిత్రం నుంచి నేడు మెగాస్టార్ పుట్టినరోజు కానుకగా అదిరే ట్రీట్ ని మేకర్స్ ప్రామిస్ చేశారు. ఇక అనుకున్నట్టుగానే ఈ సాలిడ్ గ్లింప్స్ వచ్చేసింది. ఈ చిత్రానికి 'మన శంకర్ వరప్రసాద్ గారు' అనే టైటిల్ ని లాక్ చేసినట్టుగా అనౌన్స్ చేశారు. అయితే ఈ గ్లింప్స్ లో మాత్రం అనిల్ రావిపూడి చిరంజీవిని వింటేజ్ బ్యాక్ డ్రాప్ లో ఇంట్రడ్యూస్ చేయడం అనేది హైలైట్ అని చెప్పాలి. బ్లాక్ సూట్ లో మెగాస్టార్ తన మార్క్ స్వాగ్ తో నడుచుకుంటూ వస్తుంటే తన అభిమానులకి రెండు కళ్ళు సరిపోవు అనే రీతిలో కనిపిస్తున్నారు. ఇక దీనితో పాటుగా రౌడీ అల్లుడు సినిమా సాంగ్ స్కోర్ ని భీమ్స్ మిక్స్ చేయడం ఫ్యాన్స్ కి మరింత ఇంపాక్ట్ కలిగించేలా ఉందని చెప్పడంలో సందేహం లేదు. ఇన్ని ఉన్నప్పటికీ ఇంకొక్క అంశం కూడా ఉండి ఉంటే ఈ గ్లింప్స్ నిండుగా ఉండేది అనిపించింది.



## వీధి కుక్కల బెడద.. తీర్పును సవరించిన సుప్రీంకోర్టు



ఢిల్లీ, ఎన్సీఆర్లో వీధి కుక్కలను షెల్టర్లకు తరలించాలని ఆగస్టు 11న ఇచ్చిన ఉత్తర్వులను నిలిపివేయాలని కోరుతూ దాఖలైన పటిషన్లపై సుప్రీంకోర్టు శుక్రవారం తన తీర్పును వెలువరించింది. వీధి కుక్కలకు వ్యాక్సినేషన్ చేసి వదిలేయాలని ఆదేశించింది. కేవలం రేబిస్ ఉన్న వీధి కుక్కలను మాత్రమే షెల్టర్లకు తరలించాలని ఉత్తర్వులు ఇచ్చింది. వీధి కుక్కలకు వీధుల్లో ఆహారం ఇవ్వొద్దని సుప్రీంకోర్టు సూచించింది. కేవలం కొన్ని ప్రాంతాలను ఏర్పాటు చేసి వాటికి ఆహారం అందించాలని సూచించింది. ఢిల్లీ, ఎన్సీఆర్లోని వీధి కుక్కలన్నింటిని షెల్టర్లకు తరలించాలని ఆగస్టు 11న సుప్రీంకోర్టు అధికారులకు ఆదేశాలు ఇచ్చిన విషయం తెలిసిందే. సుప్రీం ఉత్తర్వులపై ఢిల్లీ -ఎన్సీఆర్లో నిరసనలు వ్యక్తమయ్యాయి. జంతు ప్రేమికులు సుప్రీం ఉత్తర్వుల పట్ల తమ నిరసనను తెలిపారు. దీనికితోడు.. ఆగస్టు 11న ఉత్తర్వులపై స్టే విధించాలని కోరుతూ సుప్రీంకోర్టులో పలు పిటిషన్లు దాఖలయ్యాయి. ఈ పిటీషన్లపై జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ సందీప్ మెహతా, జస్టిస్ ఎన్.వి.అంజరియాతో కూడిన త్రిసభ్య ధర్మాసనం విచారణ చేపట్టింది. తీర్పును రిజర్వు చేసింది. తాజాగా.. ఇవాళ (ఆగస్టు 22) తుది తీర్పును వెలువరించింది.

ఆ కుక్కలను మాత్రం షెల్టర్లకు తరలించాలి.. రేబిస్ సోకిన, దూకుడుగా ప్రవర్తన ఉన్న కుక్కలను వదిలిపెట్టొద్దు.. వాటిని షెల్టర్లకు తరలించాలి. మిగిలిన వీధి కుక్కలకు వ్యాక్సినేషన్ వేసి వదిలివేయాలి. కుక్కలకు వీధుల్లో ఆహారం పెట్టొద్దు. వాటికి ఆహారం పెట్టేందుకు ప్రత్యేక స్థలాలు ఏర్పాటు చేయాలని మున్సిపల్ అధికారులను సుప్రీంకోర్టు ఆదేశించింది. అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు ఈ సూచనలు పాటించాలి. భారతదేశం అంతటా ఈ ఉత్తర్వులు అమల్లోకి వస్తాయని, స్థానిక అధికారులు వీటిని అమలు చేయాలని సుప్రీంకోర్టు పేర్కొంది. వీధి కుక్కలను పట్టే పనిని అడ్డుకునే వారికి రూ.25వేల నుంచి రూ.2లక్షల వరకు జరిమానా విధిస్తామని సుప్రీంకోర్టు తెలిపింది. జంతు ప్రేమికులు వీధి కుక్కలను దత్తత తీసుకోవడానికి ఢిల్లీ మున్సిపల్ కార్పొరేషన్ ను సంప్రదించవచ్చునని పేర్కొంది. నిర్దేశిత దాణా ప్రాంతాల దగ్గర నోటీసు బోర్డులు ఉంచాలని, అటువంటి ప్రాంతాల్లో వీధి కుక్కలకు మాత్రమే ఆహారం ఇవ్వాలని సుప్రీంకోర్టు ఆదేశించింది.

## విఠాబాయిగా శ్రద్ధా

ఈ క్రమంలో శ్రద్ధ నెక్స్ట్ ప్రాజెక్ట్ సంబంధించి నెట్టింట ఓ ఇంట్రెస్టింగ్ అప్డేట్ వైరల్ అవుతోంది. జానపద ప్రపంచంలో తనదైన ముద్ర వేసిన మహారాష్ట్రకు చెందిన 'విఠాబాయి నారాయణ్‌గావ్‌కర్' బయోపిక్ లో నటించనున్నట్లు ప్రచారం జరుగుతోంది.ఈ చిత్రానికి 'ఛావా' ఫేమ్ లక్ష్మణ్ ఉటేకర్ దర్శకత్వం వహిస్తుండగా.. , దినేష్ విజన్ నిర్మిస్తున్నారని వార్తలు వినిపిస్తున్నాయి. ఇందులో శ్రద్ధ 'విఠాబాయి' గా కనిపించబోతుంది. విఠాబాయి 'లవానీ', 'తమాషా' నృత్యాలకు ప్రసిద్ధి. అయితే విఠాబాయి అభిమానుల్లో 'తమాషా క్వీన్' అనే పేరుతో ప్రసిద్ధి చెందిన కారణంగా మొదట ఈ సినిమాకు మొదటగా 'తమాషా' అనే టైటిల్ పెట్టాలని నిర్ణయించుకున్నారు. కానీ ఆ తర్వాత 'విట్టా' అనే టైటిల్ ఫిక్స్ చేసినట్లు తెలుస్తోంది.కేవలం ఆమె కళారూపం గురించి మాత్రమే కాకుండా, విఠాబాయి వ్యక్తిగత జీవితాన్ని కూడా సినిమాలో చూపించబోతున్నారట. అందుకే 'తమాషా' నుంచి 'విట్టా' అని టైటిల్ చేంజ్ చేసినట్లు సమాచారం.




## హైకోర్టులో కేసీఆర్, హరీష్ రావులకు షాక్

కాళేశ్వరం ప్రాజెక్ట్‌లో చోటు చేసుకున్న అవకతవకలపై జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ ఇచ్చిన నివేదికను కొట్టివేయాలంటూ బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కేసీఆర్, హరీష్ రావు దాఖలు చేసిన పిటిషన్లపై తెలంగాణ హైకోర్టులో విచారణ కొనసాగుతోంది. అందులో భాగంగా శుక్రవారం కేసీఆర్, హరీష్‌రావు పిటిషన్లపై వాదనలు ముగిశాయి. మూడు వారాల్లో కౌంటర్ దాఖలు చేయాలని పిటిషనర్లను ఆదేశించింది. దీనిపై మధ్యంతర ఉత్తర్వులు అవసరం లేదన్న హైకోర్టు స్పష్టం చేసింది. జస్టిస్ పీసీ ఘోష్ నివేదిక.. పబ్లిక్ డొమైన్‌లో పెట్టి ఉంటే.. దానిని వెంటనే తొలగించాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. తదుపరి విచారణ నాలుగు వారాలకు వాయిదా వేసింది. అయితే పిటిషనర్లు కోరిన విధంగా స్టే మాత్రం ఇవ్వలేమని హైకోర్టు స్పష్టం చేసింది. దీంతో బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రి హరీష్‌రావుకు హైకోర్టులో నిరాశ ఎదురైనట్లు అయింది.అంతేకాకుండా.. జస్టిస్ పీసీ ఘోష్ నివేదికను అసెంబ్లీలో కంటే.. ముందే మీడియాకు ఇచ్చి.. తమ పిటిషనర్ల పరువుకు భంగం కలిగించారని కోర్టుకు న్యాయవాది సుందరం తెలిపారు. తమకు 8B, 8C కింద నోటీసు ఇవ్వలేదని కోర్టుకు తెలిపారు. దీంతో హైకోర్టు న్యాయమూర్తులు జోక్యం చేసుకుని.. 8B నోటీస్ కాకుండా సెక్షన్ 5(1) ఎందుకు ఇచ్చారంటూ ప్రభుత్వ తరఫు నాయ్యవాది ఏజీని సూటిగా ప్రశ్నించారు. తాము ఇచ్చిన నోటీస్ 8B లాంటి నోటీసని కోర్టుకు ఏజీ తెలిపారు. హరీష్ రావు, కేసీఆర్ అసెంబ్లీలో సభ్యులుగా ఉన్నారని ఈ సందర్భంగా కోర్టుకు గుర్తు చేశారు. ఈ నేపథ్యంలో అసెంబ్లీలో ఈ నివేదిక పెట్టిన తర్వాతే చర్యలు తీసుకుంటామన్న ఏజీ వెల్లడించారు. ఆ క్రమంలో ఈ నివేదిక అసెంబ్లీలో ప్రవేశపెట్టడానికి ఆరు నెలలు సమయం ఉంటుందని కోర్టుకు ఏజీ వివరించారు.

నేటి దినపత్రిక సూర్య www.suryaa.com EVENING EDITION 4PM


# 31 అర్ధరాత్రి నుంచి రాష్ట్రంలో ఆరోగ్యశ్రీ సేవలు బంద్

రాష్ట్రంలోని దవాఖానల్లో ఈ నెలాఖరు నుంచి ఆరోగ్య శ్రీ సేవలు నిలిచిపోనున్నాయి. గత ఏడాది కాలంగా బిల్లులు చెల్లించపోవడంతో రూ.1000 కోట్లకు పైగా బకాయిలు పేరుకుపోయాయి. పది రోజుల్లో బకాయిలు చెల్లించడంతో పాటు వైద్య సేవలకు నిర్ణయించిన ధరలను ప్రభుత్వం పునఃసమీక్షించకపోతే ఈ నెల 31 అర్ధరాత్రి నుంచి ఆరోగ్యశ్రీ సేవలను నిలిపివేయాలని నిర్ణయించినట్లు తెలంగాణ ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ హాస్పిటల్స్ అసోసియేషన్ (తన్హా) వెల్లడించింది. ప్రభుత్వం గత జనవరిలో ఇచ్చిన హామీల విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండటంతో ఈమేరకు నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొంది. ఇప్పటికే ఆరోగ్యశ్రీ సీఈవో ఉదయ్‌కుమార్‌కు నోటీసు పంపించినట్లు తన్హా అధ్యక్షుడు డాక్టర్ వద్దిరాజు రాకేశ్ చెప్పారు. ఆరోగ్యశ్రీతో పాటు ఉద్యోగుల ఆరోగ్య పథకం (ఈహెచ్ఎస్), జర్నలిస్టుల ఆరోగ్య పథకం (జేహెచ్ఎస్) కింద అందిస్తున్న సేవలకుగాను ప్రభుత్వం నుంచి చెల్లింపులు జరగడం లేదని, దీంతో దవాఖానల నిర్వహణ కష్టంగా మారిందన్నారు. రాష్ట్రంలో ఆరోగ్యశ్రీ పథకం కింద 471 ప్రైవేటు హాస్పిటళ్లు ఉన్నాయి. వీటన్నిటికీ కలిపి ప్రభుత్వం సుమారు రూ.1000 కోట్లకు పైగా బకాయిలు చెల్లించాల్సి ఉన్నది. అయినప్పటికీ ప్రభుత్వం నుంచి తగిన స్పందన లేకపోవడంతో ఈ నెల 31వ తేదీ అర్ధరాత్రి నుంచి ఆరోగ్యశ్రీ సేవలను నిరవధికంగా నిలిపివేయాలని నిర్ణయించినట్లు రాకేశ్ తెలిపారు. కాగా, ఆరోగ్యశ్రీ బకాయిలు చెల్లించాలనే డిమాండ్‌తో వైద్య సేవలను నిలిపివేస్తున్నట్లు తన్హా గత జనవరిలో ప్రకటించింది. దీంతో స్పందించిన ప్రభుత్వం రూ.117 కోట్లు విడుదల చేసింది. ఈ సందర్భంగా ప్యాకేజీల సవరణ, క్రమం తప్పకుండా బకాయిల చెల్లింపు, ఒప్పందాల పునరుద్ధరణ వంటి హామీలను ప్రభుత్వం ఇచ్చింది. అనంతరం వాటిని ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో బకాయిలు పెద్ద మొత్తంలో పేరుకుపోయాయి.

## ఇంజినీరింగ్ విద్యార్థులకు షాక్

# ఫీజుల పెంపుపై తెలంగాణ ప్రభుత్వ కొత్త నిబంధనలు

తెలంగాణ ప్రభుత్వం రాష్ట్రంలోని ఇంజినీరింగ్ మరియు వృత్తి విద్యా కళాశాలల ఫీజు నిర్మాణంలో మార్పులు తీసుకొచ్చేందుకు కీలక చర్యలు చేపట్టింది. ఇప్పటి వరకు ప్రధానంగా కళాశాలల ఆర్థిక స్థితిని ఆధారంగా తీసుకుని ఫీజు నిర్మాణాన్ని నిర్దేశిస్తే, ఇకపై విద్యా ప్రమాణాలు కూడా అంతే ముఖ్యంగా పరిగణనలోకి తీసుకోనున్నారు. ఈ మేరకు సంబంధిత శాఖ అధికారిక ఉత్తర్వులు జారీ చేసింది. ప్రభుత్వం వెల్లడించిన సమాచారం ప్రకారం, కళాశాలల పనితీరును విశ్లేషించడంలో కొన్ని ముఖ్యమైన అంశాలు కీలక పాత్ర పోషించనున్నాయి. విద్యార్థుల హాజరు శాతం మొదటి ప్రాధాన్యతగా ఉండగా, ఫేషియల్ రికగ్నిషన్ టెక్నాలజీ అమలును కూడా పరీక్షిస్తారు. అదేవిధంగా, ఆధార్ ఆధారిత ఫీజు చెల్లింపు విధానం, పరిశోధనలకు ఇచ్చే ప్రోత్సాహం, అర్హత కలిగిన అధ్యాపకులు, నూతన ల్యాబ్‌లు మరియు లైబ్రరీ వసతులు వంటి విద్యా మౌలిక సదుపాయాలు కూడా సమగ్రంగా పరిశీలనకు లోనవుతాయి.ఈ విధంగా, కళాశాలలు విద్యా ప్రమాణాల్లో మెరుగైన పనితీరు చూపించగలిగితేనే ఫీజు పెంపుకు అర్హత పొందుతాయని ప్రభుత్వం స్పష్టంగా తెలిపింది.ఈ వివరాలను సమగ్రంగా పరిశీలించిన తరువాతే ప్రతి కళాశాలకు అనుగుణంగా ఫీజును నిర్ణయిస్తారు. ఫలితాలు, ప్లేస్‌మెంట్‌లు కీలకంకళాశాలలో విద్యార్థుల ప్లేస్‌మెంట్ శాతం, డిమాండ్ ఉన్న కోర్సులు, మరియు పరిక్షల్లో ప్రదర్శించే ఫలితాలు కూడా ఫీజుల పరంగా ప్రభావితం చేస్తాయి. మంచి ఫలితాలు చూపే సంస్థలకు మాత్రమే తగినంతగా అధిక ఫీజు వసూలు చేసే అవకాశం ఉంటుందని ప్రభుత్వం పేర్కొంది.తెలంగాణ ప్రభుత్వం తీసుకొచ్చిన కొత్త ఫీజు విధానం ప్రకారం, నిబంధనలు పాటించని కళాశాలలకు ఇకపై ఉపశమనముండదని అధికారులు స్పష్టం చేశారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో కళాశాలకు లభించిన ర్యాంకింగ్‌లు, అలాగే ప్రభుత్వ నిబంధనల అమలులో చూపే సమగ్రత కూడా ఫీజుల నిర్ణయానికి కీలకంగా మారనుంది. నిబంధనలను గౌరవించని కళాశాలలకు అధిక ఫీజులను అనుమతించకూడదనే దృక్పథంతో ప్రభుత్వం ముందుకెళ్తోంది.ఈ విధానం ద్వారా విద్యార్థులకు నేరుగా ప్రయోజనం కలుగుతుందని నిపుణుల అభిప్రాయం. అధిక ఫీజులు వసూలు చేయాలంటే, ప్రతి సంస్థ విద్యా నాణ్యతను మెరుగుపర్చడం తప్పనిసరిగా మారుతుంది. దీనివల్ల కళాశాలల మధ్య నాణ్యమైన విద్య కోసం ఆరోగ్యకరమైన పోటీ చిగురించనుందని భావిస్తున్నారు. ఇది విద్యా రంగంలో నాణ్యత ప్రమాణాలను కొత్త స్థాయికి తీసుకెళ్లే అవకాశం కల్పిస్తుంది.ఇంతటితో కాదు, రాబోయే రోజుల్లో ఫీజుల నిర్ణయంలో NBA, NAAC వంటి అక్రిడిటేషన్ సంస్థల ప్రమాణాలతో పాటు పరిశ్రమలతో భాగస్వామ్యం, స్టార్టప్స్‌కు ప్రోత్సాహం వంటి అంశాలనూ ప్రభుత్వమే పరిగణనలోకి తీసుకోనుందని సంకేతాలు వెలువడుతున్నాయి. ఈ మార్గంలో విద్యా రంగంలో పారదర్శకతను పెంచుతూ, వాణిజ్య ధోరణిని తగ్గించాలన్నదే ప్రభుత్వ లక్ష్యంగా కనిపిస్తోంది.



# నా ఇంట్లోకి రావద్దు.. తండ్రిని అడ్డగించిన కుమార్తె

కనిపెంచిన కుమార్తె తన తండ్రిని ఇంటిలోకి రాకుండా అడ్డుకుంది. ఈ సంఘటన ఆసిఫ్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో గురువారం చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. స్థానిక మురాద్‌నగర్‌కు చెందిన సయ్యద్ అహ్మద్‌అలీకి ముగ్గురు కుమార్తెలు. ఆస్తిని ముగ్గురికి సమానంగా పంచారు. ఆస్తి తీసుకున్న తర్వాత చిన్న కుమార్తె ఇస్రా అహ్మద్ తనను సరిగా చూసుకోవడం లేదని ఆరోపిస్తూ పేరెంట్స్ అండ్ సీనియర్ సిటిజన్స్ యాక్ట్-2007 కింద కలెక్టరేట్‌లో సయ్యద్ అహ్మద్‌అలీ కొన్ని నెలల క్రితం ఫిర్యాదు చేశారు. అలాగే హైకోర్టులో కూడా పిటిషన్ దాఖలు చేశారు. దీంతో 2023లో అప్పటి కలెక్టర్ అనుదీప్ ఆదేశాలు జారీ చేస్తూ అహ్మద్‌అలీకి ఆశ్రయం కల్పించాలని కుమార్తెకు సూచించారు. అయినప్పటికీ ఆమె తన తండ్రిని రానీయకపోవడంతో అహ్మద్‌అలీ బుధవారం కలెక్టర్ హరిచందనను కలిసి తన గోడును వినిపించుకున్నాడు. దీంతో కుమార్తె ఉన్న ఇంటిని ఇల్లు ఖాళీ చేసి సయ్యద్ అహ్మద్‌కు అప్పగించాలంటూ స్థానిక తహసీల్దార్ జ్యోతికి ఆమె ఆదేశాలు జారీ చేశారు. గురువారం మధ్యాహ్నం బాధితుడితో కలిసి తహసీల్దార్ జ్యోతి మురాద్‌నగర్‌లోని అపార్ట్‌మెంట్‌కు వెళ్లారు. తండ్రిని లోపలికి రాకుండా కుమార్తె అడ్డుకుంది. ఇంటి బయట తాళం వేయడంతో ఇద్దరి నడుమ వాగ్వాదం చోటుచేసుకుంది. మధ్యాహ్నం




3 నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఇరువురి నడుమ వాదులాటతోపాటు లోపలికి వెళ్లకుండా కుమార్తె హైడ్రామా చేసింది. దీంతో తహసీల్దార్ ఆసిఫ్‌నగర్ పోలీసులను రప్పించారు. ఆ తర్వాత బలవంతంగా తాళం పగులగొట్టి ఇంటి హ్యాండోవర్ పత్రాన్ని సయ్యద్ అహ్మద్‌కు అప్పగించారు. అనంతరం సయ్యద్ అహ్మద్ మాట్లాడుతూ న్యాయం చేసిన అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.

## కామారెడ్డిలో సైబర్ మోసాలకు అడ్డుకట్ట..

# పోలీసుల చాకచక్యంతో నిందితుల అరెస్ట్

తెలంగాణలోని కామారెడ్డిలో సైబర్ నేరాలకు పాల్పడుతున్న ఓ ముఠా పోలీసుల పటిష్టమైన చర్యలతో బంధించబడింది. సోషల్ మీడియా ద్వారా పురుషులను లక్ష్యంగా చేసుకుని, వారిని లైంగిక సంబంధాల కోసం ఆకర్షించి, ఆపై నగ్న ఫొటోలు, వీడియోలతో బెదిరించి డబ్బు దోచుకునే దందాను ఈ ముఠా నడిపింది. కామారెడ్డిలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన డెన్‌లో ఈ నేరాలు జరిగాయి. బాధితుల ఫిర్యాదులతో ఈ వ్యవహారం వెలుగులోకి రాగా, పోలీసులు ఐదుగురు నిందితులను అరెస్ట్ చేశారు. ఈ ముఠా సభ్యులు సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌ల ద్వారా బాధితులను గుర్తించి, ఆన్‌లైన్‌లో ప్రాథమిక చెల్లింపులు చేయించి, డెన్‌కు రప్పించేవారు. అక్కడ వారి ప్రైవేట్ ఫొటోలు, వీడియోలు తీసి, వాటిని బయటపెడతామని బెదిరించి భారీ మొత్తంలో డబ్బు డిమాండ్ చేసేవారు. పరువు పోతుందనే భయంతో చాలామంది బాధితులు ఈ బెదిరింపులకు లొంగి డబ్బు చెల్లించారు. పోలీసులు దాదాపు 40-50 మంది బాధితులను గుర్తించారు, వీరిలో కొందరు మాత్రమే ఫిర్యాదు చేయడానికి ముందుకొచ్చారు. ఈ నేరాలు



కామారెడ్డి, నిజామాబాద్‌తో పాటు సిరిసిల్ల, ఆదిలాబాద్, మేడ్చల్, నాందేడ్‌లలో కూడా విస్తరించాయి. రెండు నెలల వ్యవధిలో 9 కేసులు నమోదయ్యాయి. దురదృష్టవశాత్తు, నిజామాబాద్‌కు చెందిన ఓ యువకుడు ఈ వేధింపుల తాకిడి తట్టుకోలేక ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. అయినప్పటికీ, బాధితులు పరువు భయంతో ఫిర్యాదు చేయడానికి వెనుకాడుతున్నారు. పోలీసులు ఈ కేసును ఉక్కుపాదంతో అణచివేస్తూ, నిందితులను అరెస్ట్ చేసి, బాధితులకు న్యాయం చేసే దిశగా చర్యలు చేపట్టారు. సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని, అనుమానాస్పద కాల్స్, సోషల్ మీడియా సందేశాలపై జాగ్రత్తగా ఉండాలని పోలీసులు ప్రజలకు సూచిస్తున్నారు. ఈ సంఘటన సైబర్ నేరాలకు వ్యతిరేకంగా పోరాటంలో పోలీసుల చురుకైన చర్యలకు నిదర్శనంగా నిలిచింది.

## భాగ్య హాట్ బ్యూటీ

విజయ్ దేవరకొండ ప్రధాన పాత్రలో నటిస్తున్న లేటెస్ట్ మూవీ కింగ్డమ్. డైరెక్టర్ గౌతమ్ తిన్ననూరి దర్శకత్వం వహించిన ఈ సినిమాలో భాగ్యశ్రీ బోర్సే కథానాయికగా నటిస్తుంది. జూలై 31న ఈ సినిమా ప్రపంచవ్యాప్తంగా అడియన్స్ ముందుకు వచ్చిన సంగతి తెలిసిందే. భాగ్యశ్రీ బోర్సే.. ఇప్పుడు కుర్రాళ్ల కొత్త నేషనల్ క్రష్. గతేడాది మాస్ మహరాజా రవితేజ సరసన మిస్టర్ బచ్చన్ సినిమాతో తెలుగు తెరకు పరిచయమైంది. భారీ అంచనాలు మధ్య విడుదలైన ఈ మూవీ డిజాస్టర్ అయ్యింది. కానీ అందరి దృష్టిని ఆకర్షించింది ఈ అమ్మడు.తొలి చిత్రంలోనే గ్లామర్ షోతోపాటు అభినయంతో కట్టిపడేసింది ఈ వయ్యారి. కానీ ఫస్ట్ మూవీ డిజాస్టర్ కావడంతో ఆమెకు పెద్దగా హెల్ప్ కాలేదు. అయితే తెలుగులో నెమ్మదిగా ఆఫర్స్ మాత్రం అందుకుంది. ప్రస్తుతం చేతిలో నాలుగైదు సినిమాలతో బిజీగా ఉంది.మిస్టర్ బచ్చన్ తర్వాత ఈ అమ్మడు నటించిన కింగ్డమ్ సినిమా విడుదలైంది. జూలై 31న అడియన్స్ ముందుకు వచ్చిన ఈ సినిమాకు పాజిటివ్ రివ్యూస్ వస్తున్నాయి. అంతేకాదు.. ఈ మూవీ ప్రమోషన్లలో గ్లామర్ లుక్స్ లో కట్టిపడేసింది భాగ్యశ్రీ. దీంతో ఈ అమ్మడు ఫోటోస్ తెగ వైరలవుతున్నాయి.

